


# మన దునియా

Our News Our World

మన అక్షరం - మన ప్రపంచం


RNI Number TELTEL/2023/85680








సంపుటి : 3 | సంచిక : 332 | జులై 31 శుక్రవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


**మన దునియా,వరంగల్ జిల్లా,నల్లబెల్లి,అర్షనపల్లి:జులై 30అర్షనపల్లి:**

గ్రామపంచాయతీలో అభివృద్ధి పనుల పేరుతో భారీగా ప్రభుత్వ నిధులు ఖర్చు చేసినట్లు అధికారిక రికార్డులు సూచిస్తున్నప్పటికీ, గ్రామంలో కనిపిస్తున్న పనులు మాత్రం ఆ స్థాయిలో లేవనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. జరిగిన పనుల కంటే డ్రా చేసిన నిధులే ఎక్కువగా ఉన్నాయన్న ఆరోపణలతో గ్రామపంచాయతీ వ్యవహారాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనుల విషయంలో అంచనాలు, బిల్లులు, చెల్లింపులు, వాస్తవంగా జరిగిన పనుల మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కొన్ని పనులు పూర్తికాకముందే బిల్లులు చెల్లించారని, మరికొన్ని పనులు కేవలం రికార్డులకే పరిమితమయ్యాయని వారు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం పూర్తి అనుమతి లేకుండానే కొన్ని బిల్లులను క్లియర్ చేశారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పాలకవర్గ తీర్మానాలు, పరిపాలనా అనుమతులు, సాంకేతిక ధ్రువీకరణలు లేకుండానే నిధులు విడుదలయ్యాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత ఉన్నతాధికారులు

(మిగతా 2వ పేజీలో..)

## దేశంలో అడుగు పెట్టిన వెంటనే హసీనాను అరెస్ట్ చేస్తాం.. బంగ్లా మంత్రి హెచ్చరిక!

- డిసెంబర్‌లో స్వదేశానికి వెళతానన్న హసీనా
- కోర్టులో లొంగే అవకాశం ఉండకపోవచ్చన్న ఆ దేశ మంత్రి
- హసీనా పాస్‌పోర్టు ఇప్పటికే రద్దు
- 2025లో మరణశిక్ష విధించిన ట్రైబ్యునల్

స్వదేశానికి వెళ్లాలనుకుంటున్నట్లు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రకటించిన నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం మరోసారి తన కఠిన వైఖరి వెల్లడించింది. దేశంలో అడుగుపెట్టిన క్షణమే ఆమెను అరెస్ట్ చేస్తామని ఆ దేశ న్యాయశాఖ మంత్రి ఎం.అసదుజ్జమాన్ స్పష్టం చేశారు. చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామని, ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండదని పేర్కొన్నారు.ఫ్రాన్స్‌కు చెందిన వార్తా సంస్థ ఏఎఫ్‌పీకి ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో షేక్ హసీనా ఈ ఏడాది డిసెంబర్‌లోగా స్వదేశానికి తిరిగి వెళ్తానని

(మిగతా 2వ పేజీలో..)



## పేపర్ లీక్ ముఠాలను ఇక సహించేది లేదు.. ఇన్‌స్టాలో మోదీ కొత్త సందేశం

- పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం
- స్వాగతించిన ప్రధాని నరేంద్ర మోదీ
- పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టీకరణ
- పరీక్షల వ్యవస్థను పటిష్ఠం చేయడానికి సంస్కరణలు చేపట్టినట్లు వెల్లడి



విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి

(మిగతా 2వ పేజీలో..)

## '2034 వరకు నేనే సీఎం'.. ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

- టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం
- విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు
- 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య
- ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ

విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై

(మిగతా 2వ పేజీలో..)




## పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం.. రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు

- రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం
- గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా
- జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ
- ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు
- సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్

2



మన దునియా

# అర్షనపల్లి జీపీలో నిధుల గోల్‌మాల్..?

(మొదటి పేజీ తరువాయి)

గ్రామంలో ప్రత్యక్షంగా ఫీల్డ్ విజిట్ నిర్వహించి, కొలత పుస్తకాలు (ఎంబీ బుక్స్), అంచనాలు, వర్క్ ఫైళ్లు, బిల్లులు, బ్యాంకు చెల్లింపులు, పనుల నాణ్యత, వాస్తవంగా జరిగిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి పనుల పేరుతో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగిందా? లేక ఆరోపణలు నిరాధారమా? అనే అంశాలపై జిల్లా స్థాయి అధికారులు సమగ్ర విచారణ చేపట్టి ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో నిజం తేలితే బాధ్యులపై చట్టపరమైన, శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పేపర్ లీక్ ముఠాలను ఇక సహించేది లేదు.. ఇన్‌స్టాలో మోదీ కొత్త సందేశం

(మొదటి పేజీ తరువాయి)

ఉందని హామీ

పబ్లిక్ పరీక్షల్లో పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేసిన ఆయన.. పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలన్నీ పేపర్ లీకుల సమస్యను ఎదుర్కొన్నాయని మోదీ గుర్తుచేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని పెంచడం, వేగవంతమైన వ్యవస్థలను అమలు చేయడం, పారదర్శకతను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొత్త చట్టంతో పేపర్ లీక్ ముఠాలపై మరిన్ని కఠిన చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## దేశంలో అడుగు పెట్టిన వెంటనే హసీనాను అరెస్ట్ చేస్తాం.. బంగ్లా మంత్రి హెచ్చరిక!

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, హత్య కూడా చేయొచ్చని తెలుసని, అయినా ప్రజలు పిలుస్తున్నందున తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. గత నెలలో ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కూడా ఎన్ని అడ్డంకులు వచ్చినా బంగ్లాదేశ్‌కు వెళతానని చెప్పారు.ఈ వ్యాఖ్యలపై స్పందించిన న్యాయశాఖ మంత్రి, మరణశిక్ష పడిన వ్యక్తిగా హసీనాకు కోర్టులో నేరుగా లొంగిపోయే అవకాశం కూడా దక్కకపోవచ్చని అన్నారు. ఆమె బంగ్లాదేశ్ పౌరురాలిగా స్వదేశానికి వచ్చే హక్కు ఉన్నా, దేశంలోకి ప్రవేశించిన వెంటనే చట్ట ప్రకారం అరెస్ట్ చేస్తామని చెప్పారు. మధ్యంతర ప్రభుత్వం ఇప్పటికే షేక్ హసీనా పాస్‌పోర్టును రద్దు చేసింది. అలాంటప్పుడు ఆమె ఎలా వస్తారన్న ప్రశ్నకు అది ఆమె సమస్యని మంత్రి వ్యాఖ్యానించారు. ఆమె ఎలాంటి మార్గంలో దేశంలోకి వచ్చినా చట్టపరమైన చర్యలు తప్పవని చెప్పారు. 2024లో విద్యార్థుల ఉద్యమం తర్వాత హసీనా ప్రభుత్వం కూలిపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆమె భారత్‌లో రహస్య ప్రాంతంలో ఉంటున్నారు. 2025లో బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఆమెకు మరణశిక్ష విధించింది. అయితే ఈ తీర్పును హసీనా రాజకీయ కక్షసాధింపుగా అభివర్ణించారు. మరోవైపు, ఈ విచారణలో న్యాయపరమైన లోపాలున్నాయని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు విమర్శించాయి. హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ చేసిన అభ్యర్థన ప్రస్తుతం పరిశీలనలో ఉందని భారత్ తెలిపింది.



# ‘2034 వరకు నేనే సీఎం’.. ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. “మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే వాటిని పరిష్కరిస్తాను. ప్రమోషన్లు, బదిలీలు కూడా మీ ఇంటి వద్దకే పంపించాం. ఇకపై మీకోసం కాదు.. విద్యార్థుల సమస్యల కోసం నాతో కొట్లాడండి” అని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు.2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి, ఆ లోపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 55 రోజుల్లో 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని గుర్తు చేశారు. ఇలాంటి నియామకాలు గతంలో ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులదేనని, అందుకే వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.రాబోయే ఐదేళ్లలో తెలంగాణ విద్యాశాఖను ప్రపంచ దేశాలు ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని రేవంత్ పిలుపునిచ్చారు. పంచవర్ష ప్రణాళిక తరహాలో ఉపాధ్యాయ సంఘాలు ప్రతిజ్ఞ చేసి పని చేయాలని కోరారు. అలాంటి కృషి చేస్తే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని అన్నారు. దేశానికి విద్య, వైద్య రంగాల్లో తెలంగాణే నాయకత్వం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు.ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నేరుగా చర్చిస్తానని సీఎం హామీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు సమయానికి పడేవి కాదని, ఇప్పుడు మాత్రం అడగకుండానే ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అదే రోజు వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించారు.

# పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం.. రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు

- రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం
- గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా
- జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ
- ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు
- సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్



దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్‌లను అరికట్టడం లక్ష్యంగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రపతి అంగీకారం లభించగానే ఇది చట్టంగా అమల్లోకి రానుంది.కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా ప్రభుత్వం, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడీ వాదనలు జరిగాయి. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికే ఈ సవరణలు తీసుకొచ్చామని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారీ జరిమానాలు, ప్రత్యేక కోర్టులు, వేగవంతమైన విచారణలతో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపింది.ఈ సవరణల ప్రకారం పేపర్ లీక్‌లకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జైలు శిక్షతో పాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తి చేసే నిబంధనలను కూడా చేర్చారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడే ముఠాలపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు ఈ మార్పులు ఉపయోగపడతాయని ప్రభుత్వం పేర్కొంది.2024లో తీసుకొచ్చిన చట్టం అమలులో వచ్చిన అనుభవాల ఆధారంగానే ఈ సవరణలు రూపొందించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. ఆ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. పేపర్ లీక్‌ల కారణంగా ఆత్మహత్యల సంఖ్య కూడా తగ్గిందని సభకు వివరించారు.అయితే ప్రతిపక్షం మాత్రం బిల్లుపై విమర్శలు గుప్పించింది. కేవలం శిక్షలు పెంచడం సరిపోదని, పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపైనా ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు విద్యార్థుల ప్రయోజనాల కోసం కేంద్రం వేగంగా చర్యలు తీసుకుందని అధికార పక్షం పేర్కొంది. మాజీ విద్యాశాఖ మంత్రి రాజీనామా, నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడం వంటి చర్యలను ప్రస్తావించింది.

## జంతర్‌మంతర్ విద్యార్థి ఆందోళనల కేసులపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న నిజమైన విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల ప్రారంభంలో నమోదైన కేసులపై కీలక నిర్ణయం తీసుకుంటూ, అరెస్టు చేసినా, అదుపులోకి తీసుకున్నా అలాంటి విద్యార్థులను త్వరగా విడుదల చేస్తామని స్పష్టం చేసింది.ఢిల్లీ ప్రభుత్వ హోంశాఖ ప్రధాన కార్యదర్శి సంతోష్ డి. వైద్య విడుదల చేసిన సర్క్యులర్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. నీట్-యూజీ ప్రశ్నపత్రాల లీక్‌కు నిరసనగా నిర్వహించిన ఆందోళనల సందర్భంగా మొత్తం 13 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. క్రిమినల్ నేపథ్యంలేని నిజమైన విద్యార్థులపై ఢిల్లీ పోలీసు శాఖ ఎలాంటి చర్యలు చేపట్టబోదని స్పష్టం చేశారు.అయితే ఈ వెసులుబాటు అందరికీ వర్తించదని ప్రభుత్వం తెలిపింది. గతంలో నేర చరిత్ర ఉన్నవారికి ఈ రక్షణ ఉండదని పేర్కొంది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించింది. ఆందోళనల్లో పాల్గొనే ముందు నుంచే క్రిమినల్ కేసులు ఉన్నవారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు.నిజమైన విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకునే నిర్ణయానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ టి.ఎస్. సంధూ ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం వెల్లడించింది. జులై 28న శైలేంద్ర మణి త్రిపాఠి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం
జులై । శుక్రవారం । 31 । 2026



# పోటెత్తుతున్న కృష్ణమ్మ- శ్రీశైలం డ్యామ్ కు వరద ప్రవాహం, గేట్లు ఎత్తివేత..!!



**మన దునియా,కర్నూల్,శ్రీశైలం: జులై 30**

ఏల్‌నినో కష్టాల వేళ బిగ్ రిలీఫ్. వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన సమయంలో కృష్ణానది మాత్రం జలకళను సంతరించుకుంటోంది. ఎట్టకేలకు శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రారంభమైంది.వానా కాలం మొదలై రెండు నెలలైనా ఇప్పటివరకు ఎగువ నుంచి ఇన్ ఫ్లో రాలేదు. కృష్ణా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉధ్ధృతి గణనీయంగా పెరిగింది. దీంతో, దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది.తెలుగు రాష్ట్రాలను రెండు నెలల కాలంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితు లు ఏర్పడ్డాయి. ఈ సమయంలోనే కృష్ణా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లోకుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతోతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉధ్ధృతి గణనీయంగా పెరిగింది. వారం రోజులుగా ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వానలు పడుతుండటంతో జూరాలకు ఇన్‌ఫ్లో భారీగా వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 32,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా... అధికారులు క్రస్ట్ గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దాదాపు 30,700 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది. మహారాష్ట్ర, కర్ణాటకలోని పశ్చిమ కనుమ ల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో.. జూరాలకు ఇన్‌ఫ్లోలు మరింత పెరిగే అవకాశం ఉంది.

**పెరుగుతున్న ఇన్ ఫ్లో.. అధికారుల అప్రమత్తం**

అదే సమయంలో ఎగువ నుంచి వచ్చే ప్రవాహం భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఫలితంగా రానున్మన రోజుల్లో శ్రీశైలానికి మరింత ఇన్ ఫ్లో పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా అటు గోదావరి బేసిన్లలో ప్రాజెక్టులకు వరద ప్రవాహం మొదలవడంతో రైతన్నల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎగువ ప్రాంతాలు, స్థానిక పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. గోదావరి బేసిన్ లోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఇక, కృష్ణాపై ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి బుధవారం 80 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కాగా, నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 89,520 క్యూసెక్కులను జూరాలకు విడుదల చేస్తున్నారు. ఇక.. శ్రీశైలం ప్రాజెక్టుకు ప్రస్తుతం 18,349 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 823.70కు చేరింది. రానున్న నాలుగు రోజుల్లో ఇన్ ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని.. నీటిని దిగువకు విడుదల చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి సన్మానం అందుకున్న జాజాల శ్రీనివాస్

**విద్యార్థుల సంఖ్య పెంపులో ఆదర్శంగా నిలిచిన అక్కపెల్లి గూడెం ప్రభుత్వ పాఠశాల**



**ఖానాపూర్ ఆర్సి మన దునియా, జన్నారం,జులై 30:**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, నాణ్యమైన విద్య అందించడంలో విశేష కృషి చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అక్కపెల్లిగూడెం ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్ రాష్ట్ర స్థాయి సన్మానం అందుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిన్లాండ్ విద్యా అధ్యయన పర్యటనకు ఎంపికైన ఉపాధ్యాయుల్లో, తమ పాఠశాలలో అత్యధికంగా విద్యార్థుల నమోదు పెంచి ప్రభుత్వ పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దినందుకు జాజాల శ్రీనివాస్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంపొందించడం, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడం, వినూత్న బోధనా పద్ధతులను అమలు చేయడం ద్వారా పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించింది. ఈ సందర్భంగా జాజాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ గౌరవం తన ఒక్కరికే కాకుండా తన పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారుల సహకార ఫలితమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు జాజాల శ్రీనివాస్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# 11 మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి









**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న 11 మంది అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లకు (ఏఎస్ఐ) సబ్ ఇన్స్పెక్టర్లుగా (ఎస్ఐ) పదోన్నతి లభించింది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ఈ పదోన్నతులు మంజూరయ్యాయి. పదోన్నతి పొందిన ఎస్ఐలు గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వారికి శు భాకాంక్షలు తెలిపారు. చాలా కాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఏఎస్ఐలకు ఎస్ఐలుగా ప్రమోషన్ రావడంతో పోలీసు సిబ్బందిలో ఆనందం వ్యక్తమైంది. పదోన్నతి పొందిన వారిలో మహిళా పోలీస్ స్టేషన్ నిజామాబాద్ చెందిన బి. జాన్సన్, వేల్పూరు పోలీస్ స్టేషన్ చెందిన జి. రాజేశ్వరరెడ్డి, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిజామాబాదు చెందిన వి. అనిల్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, టౌన్-2 పోలీస్ స్టేషన్కు చెందిన బి. సాయిలు, టౌన్-4 పోలీస్ స్టేషన్కు చెందిన ఎం.డి. లాయక్ అలీ, టౌన్-1 పోలీస్ స్టేషన్కు చెందిన డి. చిన్న గంగారం, నవీపేట్ పోలీస్ స్టేషన్కు చెందిన ఎస్.కె. గఫర్, బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్కు చెందిన కె.బాబురావు, జక్రన్పల్లి పోలీస్ స్టేషన్కు చెందిన పి. శంకర్, రుద్రూర్ పోలీస్ స్టేషన్ చెందిన రేణుకా దేవి ఉన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పదోన్నతి పొందిన అధికారులు మరింత బాధ్యతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వెల్లడించారు.




# తెలంగాణ జలాశయాలకు జలకళ!

**మన దునియా,హైదరాబాద్:జులై 30**



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మూడు, నాలుగు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నదులు, ఉపనదులు పొంగి పొర్లుతున్నాయి. ముఖ్యంగా తెలంగా ణ, మహారాష్ట్రల్లోని ఎగువ ప్రాంతాల్లో వర్షాపాతం తీవ్ర మవడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు కీలకమైన నీటి పారుదల ప్రాజెక్టుల్లో కి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటం తో జలాశయాలు సంతరించుకుంటున్న జలకళ రైతుల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర ఆనందాన్ని నింపుతోంది.నిజామాబాద్ జిల్లా లోని ప్రతిష్టాత్మక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తు తం జలాశయంలోకి 12,900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ప్రాజెక్ట నీటి నిల్వ 17.103 టీఎంసీలకు చేరింది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 300 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అలాగే, నిర్మల్ జిల్లా లోని సారంగాపూర్ మండలంలో ఉన్న స్వర్ణ ప్రాజెక్టుకు ఉదయం వేళకు నీటి సామర్థ్యం అర టీఎంసీ దాటి, ఇన్ ఫ్లో దాదాపు 10 వేల క్యూసెక్కులకు చేరిం ది. నిర్మల్ జిల్లాకే తలమానికమైన కడెం ప్రాజెక్టుకు వరద నీరు విపరీతంగా పోటెత్తుతోంది. గురువారం ఉదయం 11:00 గంటల సమయానికి కడెం ప్రాజెక్టుకు ఏకంగా 77,442 క్యూసెక్కుల భారీ ఇన్ ఫ్లో నమోదు కాగా, పరిస్థి తికి అనుగుణంగా అధికారులు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.కాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి ఉభయ నదులు పరవళ్లు తొక్కుతూ ఉధృతం గా ప్రవహిస్తున్నాయి. అక్కడ నీటిమట్టం 6.320 మీటర్ల ఎత్తులో మెట్ల వద్దకు చేరడంతో తీరం కొత్త రూపు సంతరించు కుంది. గోదావరి జలాలు పోటెత్తడంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కి ఇన్ ఫ్లో భారీగా పెరిగింది. ఎన్డీఎస్ఏ సూచన లను పాటిస్తూ అధికారులు బ్యారేజ్ కి చెందిన మొత్తం 85 గేట్లను ఎత్తి ఉంచారు. ప్రస్తుతం అక్కడ ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో సమంగా 1,01,530 క్యూసెక్కులుగా కొనసాగుతుండటంతో గోదావరి ప్రవాహం దిగువకు వేగంగా పయనిస్తోం ది. ప్రాజెక్టుల్లో క్రమం గా నీటి నిల్వలు పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థి తిని నిరంతరం సమీక్షిస్తున్నారు.

## పెద్దపల్లి జిల్లాలో భారీ వర్షాలు స్తంభించిన రాకపోకలు

**మన దునియా,పెద్దపల్లి జిల్లా:జులై 30**



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంగళ వారం రాత్రి నుంచి ఈరోజు వరకు వర్షం కురుస్తూనే ఉంది, దీంతో పెద్దపల్లి జిల్లా మంథని మండల కేంద్రంలోని బొక్కల వాగు ఉదృతంగా ప్రవహిస్తుంది, పంట పొలాల్లోకి వాగు నీరు చేరితే పంటపై మట్టి పేరుకు పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.ముత్తారం మండలం ఓడేడు నుండి భూపాలపల్లి జిల్లా లోని గ్రామాలకు వెళ్లేందుకు వేసిన మట్టి రోడ్డు వరద తీవ్రతకు కొట్టుకుపో యింది, దీంతో గరిమెళ్ళపల్లి, ఎంచపెల్లి, టేకుమట్ల, కు వెళ్లే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా భారీ వర్షాల ప్రభావంతో మంథని మండలం విరోచవరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పై నిర్మిం చిన చెక్ డ్యామ్ పై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఆ గ్రామానికి రాకపోక లు నిలిచిపోయాయి, పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం లోని హుస్సేన్ మియా వాగులోకి మానేరు నీరు తో పాటు,పంట పొలా ల్లోని నీరుచేరడంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది, దీంతో గోదావరిఖని, మంథిని, ముత్తారం, వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## అస్సాంలో ముంచెత్తిన వరదలు.. 78కి చేరిన మృతుల సంఖ్య, 3 లక్షల మందిపై ప్రభావం

**మన దునియా,అస్సాం:జూలై 30**

అస్సాంలో సంభవించిన భారీ వరదలు తీరని విషాదాన్ని మిగిల్చాయి. అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ విడుదల చేసిన తాజా హెచ్చరిక ప్రకారం, శివసాగర్ జిల్లాలో ఇద్దరు, గోలాఘాట్‌లో ఒకరు మరణించడంతో వరద మృతుల సంఖ్య ఏకంగా 78కి చేరింది.రాష్ట్రవ్యాప్తంగా ఏడు జిల్లాల్లో ఇప్పటికీ 3 లక్షలకు పైగా ప్రజలు వరద కష్టాల్లో మునిగిపోయారు. 21 రెవెన్యూ సర్కిళ్ల పరిధిలోని 551 గ్రామాలు నీటమునిగాయి. సుమారు 21,523 హెక్టార్ల పంట పొలాలు మునిగిపోయి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. బాధిత జిల్లాల్లో చరాయిదేవు పరిస్థితి అత్యంత ఘోరంగా ఉంది. ఇక్కడ ఏకంగా 1.37 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఆ తర్వాత శివసాగర్, జోర్హాట్ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ప్రస్తుతం 71 పునరావాస కేంద్రాల్లో 16,500 మందికి పైగా ఆశ్రయం పొందుతుండగా, మరో 72,000 మందికి 30 సహాయ కేంద్రాల ద్వారా నిత్యావసరాలు అందిస్తున్నారు. వరద తాకిడికి మౌలిక వసతులు, రోడ్లు, పాఠశాలలు ధ్వంసమవ్వడమే కాకుండా.. 11,000కు పైగా జీవాలు కొట్టుకుపోయాయి. మరో వైపు రాజధాని గువాహటితో పాటు కామరూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో అర్బన్ ఫ్లడ్డింగ్ (పట్టణ వరదలు) ఇంకా వీడలేదు. పడుంబరి, బోరాగావ్, జూ రోడ్, హాతిగావ్ వంటి అనేక ప్రాంతాలు బురద, నీటితో నిండిపోయాయి.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## భారీ వర్షాలకు కుప్పకూలిన ఇల్లు.. తృటిలో తప్పిన ప్రాణాపాయం

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం:జులై 30:**



గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జన్నారం మండలం మొర్రిగూడం గ్రామానికి చెందిన దుర్గం లింగవ్వ నివాసం గురువారం ఉదయం ఒక్కసారిగా కుప్పకూలింది. ప్రమాదం జరిగిన సమయంలో లింగవ్వ తన తమ్ముడి ఇంటికి వెళ్లి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.



ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం సంభవించలేదు.ఇల్లు పూర్తిగా నేలమట్టం కావడంతో ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, బియ్యం, దుస్తులు, గృహోపకరణాలు తదితర సామగ్రి ధ్వంసమై బాధిత కుటుంబానికి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా నివాసం కోల్పోవడంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో మిగిలిపోయారు.తనకు నివసించేందుకు సరైన ఇల్లు లేకపోవడంతో పలుమార్లు ఇందిరమ్మ గృహ పథకం కింద దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని బాధితురాలు లింగవ్వ ఆవేదన వ్యక్తం చేసింది. అర్హురాలినైనా గృహం మంజూరు కాకపోవడంతో నేడు ఈ దుర్ఘటన ఎదురైందని గ్రామస్థులు పేర్కొన్నారు. సంఘటనపై సంబంధిత రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి బాధితురాలికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, అలాగే ఇందిరమ్మ గృహ పథకం కింద శాశ్వత నివాసం మంజూరు చేసి ఆదుకోవాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం బాధిత కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో ప్రభుత్వం మానవతా దృక్పథంతో తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు కోసం యువత వినూత్న నిరసన!

**మన దునియా,కరీంనగర్ జిల్లా:జులై 30**



రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లన్నీ గుంతల మయంగా మారాయి,కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ ముందు రోడ్డు మర మత్తులు చేయాలని సామాజిక కార్యకర్తల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్ర మం చేపట్టారు. గత కొన్నిసంవత్సరా లుగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు చాలా అద్వానంగా ఉందని హార్ట్ పేషం ట్స్ లేదా డెలివరీ పేషెంట్ గాని ఈ రోడ్డు పై వెలితే చనిపోయే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అన్నమల్ల సురేష్ పాల్గొని 20,000 కోట్ల స్మార్ట్ సిటి డబ్బులు ఎటు పోయాయి అని ప్రశ్నించారు. నగరంలో అనేక రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని కోట్లు ఖర్చుపెట్టి నిర్మించ మని చెబుతున్న అధికారులకు, అభివృద్ధి కోసం నిధులు తెచ్చామన్న నాయకులకు ఈ కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. అధికారులు మాత్రం మంచి రోడ్ల నిర్మించా మని అందమైన రోడ్లు అహ్లాదకరమైన వాతావరణం ప్రజలకు కల్పిస్తున్నా మని గొప్పలు చెప్పు కుంటున్న నాయకు లు అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. పట్టణంలో రోడ్లు దుస్థితి ఎలా ఉన్నాయో? ఒకసారి రోడ్ల మీదికి వచ్చి చూస్తే అధికారులకు నాయకులకు అర్థమవుతుందన్నారు. నిధులు మింగడమే తప్ప పనులు మాత్రం చేయరని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా నాయ కులు అధికారులు స్పందించి ఈ గుంతల రోడ్లను బాగు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## నగరంలో రహదారులు జలమయం..

- **రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నగరంలో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి.**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా**

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నగరంలో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. ప్రధాన రోడ్లు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నిజామాబాద్ జిల్లా నగరంలోని ప్రగతి నగర్ సుభాష్ నగర్ కంటేశ్వర్ గంగస్తాన్, కలెక్టరేట్ చౌరస్తా వద్ద.. నగరంలోని ప్రధాన కూడలి అయిన కలెక్టరేట్ చౌరస్తా అమరవీరుల స్తూపం వద్ద రోడ్డుపై నీళ్లు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ నీళ్ల కారణంగా గుంతలు ఎక్కడో ఉన్నాయో తెలియక పాదచారులు సైతం అవస్థలు ఎదుర్కొన్నారు. అలాగే రైల్వేకమాన్? వద్ద.. పూలాంగ్? చౌరస్తా వద్ద సైతం వర్షం కారణంగా రోడ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. అలాగే నగరంలోని కొన్ని శివారు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు నీటితో నిండిపోయాయి. రోడ్లు జలమయం కావడంతో మురికి కాలువలు, రోడ్లు ఏవో తెలియక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



# కాసిపేట-2 గనిపై ఘనంగా 'మెగా ప్లాంటేషన్' కార్యక్రమం





- **2000 మొక్కలు నాటిన డి.ఎఫ్.ఓ రాహుల్ కిషన్ జాదవ్ జి.ఎం.ఎన్ రాధాకృష్ణ**

**మన దునియా, జులై 30,మంచిర్యాల జిల్లా**

పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో సింగరేణి మందమరి ఏరియా పరిధిలోని కాసిపేట రెండవ గని ప్రాంగణంలో గురువారం మెగా ప్లాంటేషన్ (విస్తృత మొక్కల పెంపకం) కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిందనిఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా అటవీ శాఖాధికారి (డి ఎఫ్ ఎస్ / డి ఎఫ్ ఫో) రాహుల్ కిషన్ జాదవ్ మందమరి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ విజయకుమార్, ఎ ఫ్డి ఓ, బెల్లంపల్లి, పూర్ణచందర్, ఎఫ్ ఆర్ ఓ, బెల్లంపల్లి, సర్వేశ్వరరావు, ఎ ఫ్డి ఓ మంచిర్యాల్ ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.మొక్కలు నాటడం భావి తరాల భవిష్యత్తుకు మార్గం. . డి.ఎఫ్.ఓ రాహుల్ కిషన్ జాదవ్:ఈ సందర్భంగా డి.ఎఫ్.ఓ, రాహుల్ కిషన్ జాదవ్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో సింగరేణి ఉద్యోగులు, ముఖ్యంగా మహిళా కార్మికులు అత్యంత ఉత్సాహంతో ముందుకు వచ్చి మొక్కలు నాటడంలో భాగస్వాములు కావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.ఒక మొక్కను నాటడం అంటే ఒక ప్రాణాన్ని నిలబెట్టడమే. పచ్చదనమే జీవకోటికి ప్రాణాధారం. మారుతున్న వాతావరణ మార్పులను తట్టుకోవాలన్నా, కాలుష్య రహిత వాతావరణాన్ని అందించాలన్నా ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో, పని ప్రదేశాల్లో మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలి. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ఇస్తున్న ప్రాధాన్యత ఎంతో ఆదర్శనీయం" అని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా మందమర్రి ఏరియా జీవిఎమ్ ఎన్ రాధాకృష్ణ మాట్లాడుతూ హ్లాదకరమైన వర్షపు వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒకే రోజు 2,000 మొక్కలు కాసిపేట-2 గని పైనాటడం అభినందనీయమని అన్నారు. సింగరేణి పరిధిలోని ఖాళీ స్థలాలతో పాటు, పర్యావరణ సమతుల్యత కోసం ఈ ఏడాది 38 హెక్టార్ల 'సిఏ' సింగరేణిలో ఖాళీగా ఉన్న ల్యాండ్స్‌లో మొత్తం 1,80,000 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. నిబంధనల ప్రకారం ప్లాంటేషన్: కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ (ఎం వో ఈ ఎఫ్) నిబంధనలకు అనుగుణంగా సింగరేణి పరిధిలోని 19 ఓపెన్ కాస్ట్ గనుల్లో పర్యావరణ పరిరక్షణ చర్యలను పక్కాగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.?పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కేవలం ఒక సంస్థకో లేదా ప్రభుత్వానికో పరిమితం కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భాగంగా కేకే ఓ సి పి లోని సిఏ ల్యాండ్స్ ను శ్రీ రాహుల్ కిషన్ జాదవ్ డి.ఎఫ్.ఓ మంచిర్యాల్ గారు తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం జివిఎల్ ప్రసాద్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, కాసిపేట-2 గని మేనేజర్ బారపాటి రమేష్, కేకే ఏజెంట్ కాదిర్, శాంతి కానీ ఏజెంట్ సంతోష్ కుమార్, ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, మందమరి ఏరియా ఉన్నత అధికారులు, మందమరి ఏరియా జిఎం ఆఫీస్ అధికారులు , సిబ్బంది గని సంక్షేమ అధికారి భార్గవ్ , గని ఉద్యోగులు పాల్గొన్నారు.

# లారీ డ్రైవర్ల వద్ద ఎక్సైజ్ కానిస్టేబుల్ వసూళ్లు.. సస్పెన్షన్‌కు సిఫార్సు చేసిన సూపరింటెండెంట్

**ఎక్సైజ్ అధికారులు కానిస్టేబుల్ వసూళ్లకు పాల్పడుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా**

మద్నూర్ సలాబత్‌పూర్ చెక్ పోస్ట్

మద్నూర్ వద్ద ఈ ఘటన చోటు చేసుకున్నట్టుగా తెలుస్తోంది.

క్షణాల్లో వీడియో వైరల్.. యూనిఫాంలో ఉన్న ఒక అధికారి లారీ డ్రైవర్‌ను డబ్బులు డిమాండ్ చేయగా సదరు డ్రైవర్ అధికారి వసూళ్లకు పాల్పడుతున్న దృశ్యాలను వీడియో తీశాడు. అలాగే అధికారితో పాటు ఓ ప్రైవేట్ వ్యక్తి కూడా వసూళ్లకు పాల్పడుతున్నట్టుగా వీడియోలో కనిపించింది. లారీ డ్రైవర్ వీడియో తీస్తుండడాన్ని గమనించిన అధికారి డబ్బులేమీ అవసరం లేదని మాట మార్చాడు. అలాగే వెనకాల వచ్చిన మరొక వాహనం వద్ద ప్రైవేట్ వ్యక్తి నిలబడగా ఆ దృశ్యాన్ని కూడా వీడియో తీయడంతో సదరు ప్రైవేట్ వ్యక్తికి వాహన డ్రైవర్ డబ్బులిచ్చినా తీసుకోలేదు. ఈ వీడియో సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ కాగా అధికారులు సదరు ఉద్యోగిపై చర్యలకు ఉపక్రమించారు.

సస్పెన్షన్‌కు నివేదిక పంపాం..: ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి

అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ మద్యం, గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందుకు సలబత్‌పూర్ చెక్‌పోస్ట్‌ను గత రెండు దశాబ్దాలుగా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి తెలిపారు. చెక్‌పోస్ట్‌లో ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు 24 గంటల పాటు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాజస్థాన్ నుంచి వచ్చిన ఓ ట్రక్కులో ప్రయాణిస్తున్న యూట్యూబర్, చెక్‌పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బందితో వాగ్వాదానికి దిగినట్లు ముకుంద రెడ్డి వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వెంటనే ప్రాథమిక విచారణకు ఆదేశించినట్లు చెప్పారు.ప్రాథమిక విచారణలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి ఈ ఘటనకు బాధ్యుడని గుర్తించినట్లు తెలిపారు. ఈ అంశంపై శాఖాపరమైన పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని, విచారణ నివేదికను కరీంనగర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నోడల్ అధికారికి సమర్పించనున్నట్లు వెల్లడించారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని సిఫార్సు చేస్తూ ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ఆయన తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, నిబంధనలు, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బాధ్యులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని ముకుంద రెడ్డి స్పష్టం చేశారు.



# నిజామాబాద్ ఆపరేషన్ కవచ్‌తో భారీ విజయాలు..: ఎస్పీ రాజేష్ చంద్ర

**కామారెడ్డి జిల్లాలో మొదలు పెట్టిన ఆపరేషన్ కవచ్ కార్యక్రమంలో భారీ విజయాలు సాధించినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడించారు.**

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

కామారెడ్డి: కామారెడ్డి జిల్లాలో మొదలు పెట్టిన ఆపరేషన్ కవచ్ కార్యక్రమంలో భారీ విజయాలు సాధించినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. 'ఆపరేషన్ కవచ్' కార్యక్రమం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పోలీసు కార్యాలయంలో ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించారు.

**ఏడాది కాలంగా..**

ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఏడాది కాలంలో పోలీసులు చేపట్టిన ప్రత్యేక దాడుల్లో 6 ఎన్డీపీఎస్ కేసులు నమోదు చేసి 18 మందిని అరెస్ట్ చేశారు. సుమారు 403.405 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.2.01 కోట్లు ఉంటుందని అంచనా. ఒడిశా నుంచి మహారాష్ట్ర నాసిక్‌కు తరలిస్తున్న 387.128 కిలోల గంజాయిని జాతీయ రహదారి 44పై క్యాసంపల్లి వద్ద పట్టుకున్నారు. అదేవిధంగా నర్సన్నపల్లి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల నుంచి గంజాయిని స్వాధీనం చేశారు. అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి 11 కేసులు, పశువుల అక్రమ రవాణాపై 3 కేసులు, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై 3 కేసులు నమోదు చేశారు. ఒక గుట్కా రవాణా కేసులో రూ.43 లక్షల నగదును సీజ్ చేశారు.

**అంతర్రాష్ట్ర ముఠాలు అరెస్ట్ ..**

జిల్లాలో మోటార్ సైకిల్ దొంగతనాలు, ఆయుధాల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు 18 దొంగిలించిన బైక్‌లు, 5 దేశీయ తుపాకులు, 1 ఎయిర్ గన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆలయ చోరీలు, ఆస్తి నేరాలు, ఏటీఎం దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాలను అరెస్ట్ చేశారు. అటవీ జంతువుల వేటకు పాల్పడుతున్న 8 మంది నిందితులను గాంధారి పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి 5 నాటు తుపాకులు స్వాధీనం




చేసుకున్నారు. యజమానికి తెలియకుండా దొంగిలించిన 5 లక్షల విలువైన ట్రాక్టర్‌ను రెండు గంటల్లోనే రికవరీ చేసి అప్పగించారు. నాగిరెడ్డిపేట పరిధిలో 8 కిలోమీటర్ల మేర ఛేజింగ్ చేసి నలుగురు వాహన దొంగలను పట్టుకున్నారు. పోలీసుల సేవలు కేవలం కేసులకే పరిమితం కాలేదు.

**ఎన్‌ఫోర్స్ మెంట్ ..**

ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా 5,16,984 వాహనాలను తనిఖీ చేసి, 1,19,052 మందిని పరీక్షించారు. 209 మంది అనుమానితులను గుర్తించి 3,572 డ్రంకన్? డ్రైవ్ కేసులు నమోదు చేశారు. భిక్కనూర్ టోల్‌ప్లాజా వద్ద మద్యం తాగి బస్సు నడుపుతున్న డ్రైవర్‌ను పట్టుకుని 45 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు. అంతర్రాష్ట్ర నేర ముఠాల కార్యకలాపాలు 12 నుంచి 2కి తగ్గాయి. మానవీయంగా స్పందిస్తూ టేక్రియాల్ జంక్షన్ వద్ద ఒంటరిగా ఉన్న 14 ఏళ్ల బాలుడిని గుర్తించి కుటుంబానికి అప్పగించారు. సదాశివనగర్ ఎల్లమ్మ గుడి, లింగాపూర్‌లో జరిగిన దొంగతనాలను కొన్ని గంటల్లోనే ఛేదించినట్టు ఎస్పీ పేర్కొన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సమావేశంలో డిఎస్పీలు మధుసూదన్, శ్రీనివాస్ రావు, విఠల్ రెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడు దేశ సమైక్యతను కాపాడాలి.

**దేశభక్తి అవగాహన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య.**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా**

దేశ సమైక్యత, సౌభ్రతత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పిలుపునిచ్చారు. పరాయి దేశంతో పోరాడి ఎందరో మహనీయుల ప్రాణ త్యాగాలతో స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నమని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య విద్యార్థులకు దేశ సమైక్యత, సమగ్రత, సూచించారు..అలాంటి సౌభ్రతత్వాన్ని ఐక్యతను చాటి చెప్పే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీపీ స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశభక్తిపై అవగాహన, చైతన్య కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, జిల్లా సంక్షేమ అధికారిని సౌందర్య, వయోజన విద్య ఉపసంచాలకులు. పురుషోత్తం పాల్గొన్నారు.. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ ఎందరోమహనీయుల ప్రాణ త్యాగాలు పోరాటాల ద్వారా పరాయి దేశంతో పోరాడి మనం స్వాతంత్రాన్ని సాధించుకున్నామని వెల్లడించారు.దేశ సమైక్యత, సౌభ్రతత్వం,ఐక్యత ప్రపంచ నలుమూలల చాటి చెప్పే బాధ్యత నేటి యువతతో పాటు చిన్న పెద్ద ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.. అంగవైకల్యం అనేది శరీరానికి మాత్రమే కానీ మనిషి మేధస్సుకు కాదని ఇక్కడున్న దివ్యాంగ విద్యార్థులు నిదర్శనమన్నారు.. ఎలాంటి నిరుత్సాహానికి గురికాకుండా ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని అప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమవుతుందని చెప్పారు. తమ పోలీస్ శాఖ తరపున సైతం తమ అంతు బాధ్యతగా సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగ విద్యార్థులైనప్పటికీ వారిని ప్రోత్సహిస్తూ వారికి అండగా నిలుస్తున్న స్నేహ సొసైటీ నిర్వాహకులు ఎస్. సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయ బృందాన్ని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అభినందించారు.. అయితే అంధ మానసిక దివ్యాంగ విద్యార్థులు




అయినప్పటికీ వారు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను పాటలను విన్న పోలీస్ కమిషనర్ వారిని అభినందించారు.. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన క్విజ్, చిత్రలేఖనం, ఇతర పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను అందజేశారు.. అనంతరం జిల్లా సంక్షేమ అధికారిని సౌందర్య మాట్లాడుతూ స్నేహ సొసైటీ దివ్యంగ విద్యార్థుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు.. ఒక ఆశయంతో ముందుకు సాగుతూ దివ్యాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైతం గుర్తింపు సాధించి జిల్లాను జాతీయస్థాయిలో నిలిపారని తెలిపారు.. అలాగే దేశ స్వాతంత్రాన్ని పురస్కరించుకొని దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు లాంటి ఎందరో మహనీయులు చేసిన పోరాటాలు,వారి ప్రాణ త్యాగాల గురించి విద్యార్థులకు తెలియజేశారు... అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను ప్రతి ఒక్కరిని శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు...ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ సభ్యులు తాటి వీరేశం, 42 వ డివిజన్ కార్పొరేటర్ బెల్లల్ శశాంక్ రెడ్డి, 18వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి రమేష్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దాసరి విజయనంద రావు, విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు దారం గంగాధర్, అందుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి పాఠశాలల సిబ్బంది అంద విద్యార్థులు, మానసిక వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

# చతిస్గఢ్ రాకపోకలు బంద్

**మన దునియా, వాజేడు, జులై 30**

హైదరాబాదు నుండి చతిస్గడ్ వెళ్లే ఎన్ హెచ్ 163 జాతీయ రహదారిపై ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం గ్రామ శివారులో రేగు మాకు బ్రిడ్జి దగ్గర గోదావరి ఉప్పొంగి రోడ్డుని నీటితో ముంచటంతో చతిస్గడ్ నుండి హైదరాబాదుకు వెళ్లే వాహనాలు అంతరాయం కలిగింది ఈ విషయాన్ని గమనించిన టేకులగూడెం







సర్పంచ్ చిడేం బాలకృష్ణ గుమస్తా సదానందం గ్రామపంచాయతీ సిబ్బందితో బారిగేట్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఎవరు అటు పక్క పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది మోటర్ సైకిల్ వెళ్ళవద్దని హెచ్చరిక జారీ చేశారు పశువుల కాపర్లు కూడా అటువైపు వెళ్ళకుండా పశువుల కోసం నీళ్లలో దిగకుండా ఉండాలని తెలియజేశారు

# ఎంఆర్పిఎస్ టౌన్ ఇంచార్జ్ గా మంతెన సదానందం ఎన్నిక

**మన దునియా, జులై 30,మంచిర్యాల టౌన్**





ఎంఆర్పిఎస్ మందమర్రి టౌన్ ఇంచార్జ్‌గా మంతెన సదానందం గురువారం నియమితులైనారు. ఈ సందర్భంగా మంతెన సదానందం కి ఎం ఆర్ పి ఎస్ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మంతెన సదానందం మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాపై ఉన్న నమ్మకం తో మందమర్రి టౌన్ ఇంచార్జ్ గా నియమించినందుకు నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతానని మందమర్రి టౌన్‌లో ఎం ఆర్ పి ఎస్ ని మరింత బలోపేతం చేసే విదంగా ముందుకు సాగుతానని, పట్టణం లో ఎటువంటి సమస్య ఉందని తెలిసిన ముందుండి సమస్యల పరిష్కారం చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఎల్లప్పుడూ ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ,జిల్లా ఇన్చార్జి లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, చెన్నూరు నియోజకవర్గ కో ఇన్చార్జి జీడి సారంగం మాదిగ, మండల్ ఇంచార్జ్ జంపన్న తదితరులు పాలొగొన్నారు.

# ప్రస్తుత వర్ష పరిస్థితులలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**



**మన దునియా,జులై 30, మంచిర్యాల జిల్లా**

ప్రస్తుతం కురుస్తున్న వర్ష పరిస్థితులలో ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటి గోడ కూలిన ఘటనలో గాయాలై చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, ఆర్.ఎం.ఓ. లు భీష్మ, శ్రీధర్, కోటపల్లి మండల తహసిల్దార్ రాఘవేంద్ర లతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కోటపల్లి మండలం ఆలుగాం గ్రామానికి చెందిన ఆత్రం మాంతయ్య ఇంటి గోడ కూలి ఇంటిలో ఉన్న ఆత్రం లక్ష్మి తలకు, ఆత్రం అనిల్ చేతికి గాయాలై మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. బాధితులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందని, పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుత వర్ష పరిస్థితులలో ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు వర్షాల కారణంగా ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని చెన్నూర్, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్లకు తీసుకోవలసిన చర్యలపై ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజా సంరక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిట్లం మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పిట్లం మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిట్లం ఎస్సై బి. ఆంజనేయులు సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, పాడైపోయిన లేదా పగుళ్లు ఏర్పడిన ఇళ్లలో నివసించవద్దని, అత్యవసర పరిస్థితులు మినహా బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. కరెంట్ స్థంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగల దగ్గరకు వెళ్లరాదని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ముట్టుకోకూడదని హెచ్చరించారు. అలాగే బోర్ మోటార్లు ఉపయోగించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వాగులు, వంతెనలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్న సమయంలో కాలినడకన గానీ, వాహనాలతో గానీ దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో నడవకుండా ఉండాలని, చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు అత్యవసరం లేకుంటే బయటకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తాగునీటిని తప్పనిసరిగా మరిగించి మాత్రమే ఉపయోగించాలని, ఏవైనా అత్యవసర మాత్రమే ఉపయోగించాలని, ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు. అలాగే ఈత కొట్టేందుకు, చేపల వేట కోసం లేదా సరదాగా సెల్ఫీలు తీసుకునేందుకు వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని హెచ్చరించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండి, ప్రభుత్వ అధికారులు జారీ చేస్తున్న సూచనలు, హెచ్చరికలను పాటించాలని పిట్లం ఎస్సై బి. ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు.



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం

## గోదావరి పరివాహక ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి

- సి డబ్ల్యూ సి హెచ్చరిక

**మన దునియా , వాజేడు, జులై 30**



సి డబ్ల్యూ సి (సెంట్రల్ వాటర్ కమిషన్) వారు తెలిపిన సమాచారం ఆధారంగా పై ప్రాజెక్టుల నుంచి గోదావరి వరద ప్రవాహం అంతకంతకు పెరుగుతూ 31- 07- 2026 తెల్లవారుజాము వరకు సుమారు తొమ్మిది లక్షల క్యూసెక్కుల నీరు సమ్మక్క సాగర్ నుండి దిగువకు వరద నీరు రానున్నది అని సమాచారం ఈ కార్యక్రమంలో 31: 07:2026 తెల్లవారు జాము వరకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నది గోదావరి నది పరివాహక ప్రాంతాలలో ఉన్న కన్నాయిగూడెం ఏటూరు నాగారం వాజేడు వెంకటాపురం మంగపేట మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్ళకూడదని అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ శాఖల అధికారుల సహాయం తీసుకోవాలని సూచన చేశారు

## భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**జిల్లా కలెక్టర్లు,పోలీస్ అధికారులకు సి.ఎస్.ఆదేశం**

**మన దునియా,హైదరాబాద్:జులై 30**



రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏవిధమైన ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉన్నందున చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, ఎస్. పి లతో సి.ఎస్ సంజయ్ జాజు గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ సి.వీ ఆనంద్, అడిషనల్ డీజీ భగవత్, డిజాస్టర్ మేనేజ్ మెంట్ కార్యదర్శి హరిచందన, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, గురువారం రాత్రి కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్నందున జిల్లాల్లో పోలీసు వివిధ శాఖలతో సమన్వయంతో తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రధానంగా, ఆయా జిల్లాలో వాటర్ ఫాల్స్, ప్రమాదకర ప్రదేశాలు ఉన్న పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల కలెక్టర్లు పరిస్థితులను ఎప్పటి కప్పుడు సమీక్షిస్తుండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఇప్పటికే, ఎన్.డీ.ఆర్.ఎఫ్, ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని, అవసరమైనప్పుడు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఎల్.నినో ప్రభావం వల్ల సెప్టెంబర్ లోనూ వర్షపాతం తక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ పేర్కొన్నందున వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలను వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రధానంగా, కూరగాయలు పండిస్తే మార్కెట్ లో మంచి ధర ఉండడమే కాకుండా హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా కూడా కొనుగోలు చేయించడం జరుగుతుందని సి.ఎస్ అన్నారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలో249 ప్రమాదకర జలాశయాలున్న పిక్-నిక్ స్పాట్స్ లను గుర్తించామని, మరో 167 పర్యాటక ప్రాంతాలను గుర్తించి భారీ వర్షాలు, వరదలున్న సమయంలో ఈ పర్యాటక ప్రాంతాలకు వెళ్లకుండా పోలీస్ శాఖ తగు చర్యలను చేపట్టిందని డీజీపీ సి.వీ ఆనంద్ వెల్లడించారు.12 కంపెనీల ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు.

## నల్మాసు ప్రభాకర్ ను స్వర్ణ పథకంతో సన్మానించిన లలిత కళ సంస్కృతిక సేవ సంస్థ!


**మన దునియా,మంథని:జులై 30**

పెద్దపల్లి జిల్లా మంథని పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు నల్మాస్ ప్రభాకర్, వైశ్య సంఘానికి గత 25 సంవత్సరాల నుండి సేవలందిస్తు న్నందుకు గాను, ఆయనకు వైశ్య భవన బిరుదు తో పాటు స్వర్ణ పథకం బహుకరించారు.నల్మాస్ ప్రభాకర్ సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం చూపుగా పాల్గొంటూ మంచి గుర్తింపు సంపాదించారు. ఇతర వేదికల ద్వారా వైశ్యులకు వైశ్య సామాజిక వర్గాల వారికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా హైదరాబాద్ కు చెందిన లలిత కళా సమాఖ్య సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ ఆయనను గురువారం ఘనంగా సన్మానించింది.. అంతేకాకుండా ఆయనకు అత్యు న్నతమైన వైశ్య వైభవ రత్న బిరుదు అవార్డుతో పాటు... బంగారు పథకంతో సత్కరించారు. ప్రభాకర్ ఈ అవార్డు కు ఎంపికైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నూరు మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి గంద్ర వెంకటరమణ రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రయ్య, తో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బుచ్చన్న, యూత్ కాంగ్రెస్ నాయకులు రావిగంటి సతీష్, ప్రభాకర్ కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.



# విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలి





SCHEDULED CASTES DEVELOPMENT DEPARTMENT,
Mulugu District.
GOVT.SC.PRE-METRIC HOSTELS DAILY MENU FOR THE YEAR 2026-27

| SL NO. | DAY | MORNING 7.00AM | BREAKFAST 8.00AM | LUNCH 12.30 PM | SNACKS 5.00 PM | DINNER 7.00 PM |
|---|---|---|---|---|---|---|
| 1 | సోమవారం | రాగిజావ | కిచిడి + చారు | మధ్యాహ్న భోజనం పాఠశాల యందు (M.D.M) | బిస్కెట్ | అన్నము + కూరగాయలు + సాంబార్ + అరటి పండు + కోడిగుడ్డు |
| 2 | మంగళవారం | రాగిజావ | ఉప్మా(నాటు రవ్వ)+చట్ని | | పల్లిపట్టి | అన్నము + పప్పు + రసము + కోడిగుడ్డు + అరటి పండు |
| 3 | బుధవారం | రాగిజావ | రెమన్ రైస్/పోపు రైస్ | | శనిగలు | అన్నము + కూరగాయలు + సాంబార్ + కోడిగుడ్డు + అరటి పండు |
| 4 | గురువారం | రాగిజావ | ఉప్మా(బొంబాయి రవ్వ)+కసము | | అటుకులు | అన్నము + చికెన్ + సాంబార్ |
| 5 | శుక్రవారం | రాగిజావ | అలుబిర్యాని | | పల్లిపట్టి | అన్నము + కూరగాయలు + సాంబార్ + కోడిగుడ్డు + అరటి పండు |
| 6 | శనివారం | రాగిజావ | పులిహోర | | సేమియా | అన్నము + ఆకు కూర పప్పు + రసము + కోడిగుడ్డు + అరటి పండు |
| 7 | ఆదివారం | రాగిజావ | ఇడ్లీ + సాంబార్ | బగారా రైస్ + చికెన్ + సాంబార్ | బిస్కెట్ | అన్నము + కూరగాయలు + సాంబార్ |

చికెన్ : వారానికి రెండు సార్లు
కోడిగుడ్డు : వారానికి (5) సార్లు
అరటి పండు : వారానికి (5) సార్లు
స్నాక్స్: ప్రతి రోజు సాయంత్రం
నోట్: ఆదివారం మినహా సెలవు రోజులలో శనస్పతి పండు భోజన వసతి ఉప్పయుశ ఆ రోజు అరటి పండు, కోడిగుడ్డు ఉప్పలియుతే ఇవ్వబడును. అన్నము + కూరగాయలు + సాంబార్ మాత్రమే ఇవ్వబడును

30/7/2026
DISTRICT COLLECTOR (SCDD)
MULUGU DISTRICT

**మెనూ షెడ్యూల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలి**

**జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

**మన దునియా,ములుగు జిల్లా:జులై 30**

వసతి గృహాలలోని విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని తప్పనిసరిగా మెనూ పాటించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఎస్సీ ప్రీ-మెట్రిక్ హాస్టళ్లలో 2026--27 విద్యా సంవత్సరానికి అమలు చేయనున్న వారాంత ఆహార మెనూ పోస్టర్‌ను తన ఛాంబర్‌లో జిల్లా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ షెడ్యూల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతిరోజు నిర్ణయించిన ఆహార పదార్థాలనే విద్యార్థులకు అందించాలని సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఏ ఎస్ డబ్ల్యూ ఓ సురేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## వృద్ధులు, దివ్యాంగులకు చేరువలో పోలింగ్ కేంద్రాలు

**ఓటర్లకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం**

**ఎన్నికల నమోదు అధికారి ఆర్డీవో కృష్ణవేణి**

**మన దునియా,ములుగు జిల్లా: జులై 30**





వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ములుగు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి తెలిపారు.గురువారం వెంకటాపూర్ మండల పరిధిలోని నూతన పోలింగ్ కేంద్రాలను ఈఆర్వో కృష్ణవేణి పరిశీలించారు.ఈ సందర్భంగా సుబ్బక్కపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్ నెం. 5/ఏకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించారు.ప్రస్తుతం ఉన్నా పోలింగ్ స్టేషన్ నెం. 4లో ఉన్న 1,391 మంది ఓటర్లలో 50 మందిని, పోలింగ్ స్టేషన్ నెం. 5లో ఉన్న 1,345 మంది ఓటర్లలో 400 మందిని విభజించి సుమారు 450 నుంచి 500 మంది ఓటర్లతో కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలు నాలుగు కిలోమీటర్లకు పైగా దూరంలో ఉండటంతో 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన అధికారులు, వారి సౌకర్యార్థం కొత్త కేంద్రాన్ని ప్రతిపాదించినట్లు తెలిపారు.అనంతరం పేర్కపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ నెం. 3/ఏ ను ఈఆర్వో సందర్శించారు.ఈ కేంద్రం పరిధిలో బావ్‌సింగ్‌పల్లి గ్రామానికి చెందిన 277 మంది, లక్ష్మీపురం గ్రామానికి చెందిన 150 మంది, పేర్కపల్లి గ్రామానికి చెందిన 300 మంది కలిపి మొత్తం 727 మంది ఓటర్లు ఉండనున్నారు.ఇప్పటి వరకు 1,221 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రం నుంచి వీరిని విభజించినట్లు తెలిపారు.సుబ్బక్కపల్లి, పేర్కపల్లి గ్రామ పంచాయతీల గ్రామసభలు కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనుకూలంగా తీర్మానాలు ఆమోదించినట్లు వెల్లడించారు.రానున్న 109- ములుగు శాసనసభ నియోజకవర్గం, 16- మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ప్రతి ఓటరికి చేరువలో ఓటింగ్ సౌకర్యం కల్పించడమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గిరిబాబు, ఎన్నికల డిటి నితీష్ కుమార్, బి ఎల్ వోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



# రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు.. 12 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

**రాష్ట్రవ్యాప్తంగా 587 మండలాల్లో వర్షం.. స్తంభించిన జనజీవనం**
**పొంగి పొర్లిన వాగులు, చెరువులు.. పలు చోట్ల రహదారులపైకి నీరు**
**వాగులో కొట్టుకుపోయి ఒకరి మృతి, మరొకరు గల్లంతు**
**నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు**

**మన దునియా,హైదరాబాద్:జులై 30**

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ఎడతెరిపిలేని వానల ధాటికి పలు ప్రాంతాల్లో వాగులు ఉప్పొంగగా, చెరువులు తెగిపోయి, రహదారులపైకి వరద నీరు చేరడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల పంటలు నీటమునిగాయి. ముఖ్యంగా నిర్మల్ జిల్లా బల్లివాగు దాటుతూ ఒక గిరిజన మహిళ ప్రాణాలు కోల్పోగా, ములుగు జిల్లా మేడారం వనదేవతల దర్శనానికి వచ్చి, జంపన్నవాగులో ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఇసుకవాగు ఉప్పొంగడంతో జాతీయ రహదారి 163పైకి నీరు చేరింది. చీకుపల్లి వద్ద ప్రముఖ పర్యాటక ప్రాంతం బొగత జలపాతం వరదనీటితో ఉరకలేస్తోంది. దీంతో జలపాతం సందర్శనను నిలిపివేశారు. నిర్మల్ జిల్లా సోన్-ధర్మారం మధ్య ప్రధాన రహదారి వరద నీటికి దెబ్బతినడంతో రవాణా వ్యవస్థకు విఘాతం కలగగా, పెంబి మండలంలో కడెం వాగు పొంగిపొర్లుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గురువారం నాటికి 30 అడుగులకు చేరే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. వర్షాల ధాటికి పలు జిల్లాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. తెలంగాణలో 621 మండలాలుంటే ఏకంగా 587 చోట్ల మంగళవారం వర్షం పడింది. 30 మండలాల్లో అయితే ఏకంగా 10-20 సెంటీమీటర్ల మధ్య భారీ నుంచి అతిభారీ వర్షం కురిసింది.

సింగరేణిలో నిలిచిన ఉత్పత్తి..

జయశంకర్ జిల్లా భూపాలపల్లి జిల్లాలోని సింగరేణి ఓపెన్‌క్ష?స్ట మైన్ 2, 3లో ఉత్పత్తి నిలిచిపోగా,సంస్థకు రూ.9 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. మల్హర్ మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్టులో 18 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నిలిచిపోయినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, మంచిర్యాల జిల్లాలోనూ వర్షాల వల్ల సింగరేణి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. వర్షపు నీరు చేరడంతో గనుల్లో భారీ యంత్రాలు కదల్లేని పరిస్థితి ఏర్పడింది. ఒక్కరోజులో దాదాపు 32 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హైదరాబాద్‌ను ముసురువాన కప్పేసింది. రోజంతా పలుమార్లు కురిసిన చిరుజల్లులతో నగరం తడిసిముద్దయింది. దీంతో చిరువ్యాపారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు.

భారీ వర్ష సూచన..

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో గురు, శుక్రవారాల్లో




తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురుస్తాయని, ఆ జిల్లాల్లో 20-40 సెంటీమీటర్ల మధ్య కుండపోత కురిసే అవకాశం ఉందని ప్రైవేటు వాతావరణ నిపుణులు బాలాజీ వెల్లడించారు. ఈ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. కాగా మిగిలిన జిల్లాల్లో మోస్తరు నుంచి తేలిక పాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించారు.

వర్షపాతం వివరాలు..

జిల్లా- మండలం- సెంటీమీటర్లు
జయశంకర్- పలిమెల- 19.4
జగిత్యాల-సారంగాపూర్-19.4
జగిత్యాల-బుగ్గారం-18.3
జగిత్యాల-వెల్గటూరు-17.5
జగిత్యాల-ఎండపల్లి-15.3

వరద నీటిలో కొట్టుకుపోయి మహిళ మృతి..

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని చామన్‌పెల్లికి చెందిన మర్సుకోల పారుబాయి(50) వరద నీటిలో కొట్టుకుపోయి ప్రాణం కోల్పోయింది. తన భర్త మధుతో కలిసి బుధవారం ఉదయం పింఛన్ డబ్బులు తీసుకోవడానికి పారుబాయి సోమార్‌పేట్ (ఎర్వచింతల్) వెళ్లింది. కూరగాయల కొనుగోలుకు ఒంటరిగా వెళ్లిన పారుబాయి.. తిరిరి చామన్‌పెల్లికి బయలుదేరింది. మార్గమధ్యంలో బల్లివాగు దాటి వెళ్లేందుకు ప్రయత్నిస్తూ కొట్టుకుపోయింది. ఓ చెట్టు వద్ద ఆమె మృతదేహం లభ్యమైంది. అలాగే, ములుగు జిల్లాలోని జంపన్నవాగులో ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన కారు డ్రైవర్ పీట్ల తిమ్మయ్య(45) ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని సమ్మక్కసారలమ్మ దర్శనానికి వెళ్లాడు. జంపన్నవాగు ఘాటు వద్ద మెట్లపై పుణ్యస్నానం ఆచరిస్తుండగా ప్రమాదవశాత్తు వరద నీటిలో మునిగి గల్లంతయ్యాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా అతడి ఆచూకీ లభించలేదు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఆలుగామలో ఇల్లు కూలి ఆత్రం లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి..

# 15 ఏళ్ల వైభవ్‌కు వైస్ కెప్టెన్సీ ఎందుకు? అసలు కారణం వెల్లడించిన సెలెక్టర్

భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి దులీప్ ట్రోఫీ-2026లో ఈస్ట్‌జోన్ వైస్ కెప్టెన్సీ అప్పగించడం చర్చనీయాంశమైంది. ఇంత చిన్న వయసులో బాధ్యతలు ఇవ్వడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని ఈస్ట్‌జోన్ సెలెక్టర్, మాజీ రంజీ క్రికెటర్ ప్రవంజన్ వెల్లడించారు. భవిష్యత్‌లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే వైభవ్‌కు ఈ బాధ్యతలు ఇచ్చామని చెప్పారు. ఈస్ట్‌జోన్ జట్టుకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడని, వైభవ్‌ను కెప్టెన్‌గా నియమించలేదని ప్రవంజన్ స్పష్టం చేశారు. ఇషాన్ వికెట్‌కీపర్ కావడంతో మ్యాచ్‌లో ఎక్కువ సమయం మైదానంలో చురుగ్గా ఉంటాడని చెప్పారు. వైభవ్ రోజంతా జట్టును నడిపించాల్సిన పరిస్థితి ఉండదని వివరించారు. చిన్న వయసులోనే బాధ్యతలు ఇవ్వడం వల్ల అతడిలో నాయకత్వ నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. వైభవ్‌కు నాయకత్వ అనుభవం కొత్తేమీ కాదని ప్రవంజన్ గుర్తుచేశారు. ఇప్పటికే బిహార్ తరఫున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నాడని తెలిపారు. అండర్-19 ప్రపంచకప్‌లో కూడా ఆయుష్ మాత్రేకు డిప్యూటీగా బాధ్యతలు నిర్వర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. దేశం తరఫున అద్భుతంగా రాణిస్తున్న వైభవ్ ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున కూడా ఆకట్టుకున్నాడని కొనియాడారు. యువ ఆటగాళ్లకు సరైన సమయంలో బాధ్యతలు అప్పగించడం చాలా ముఖ్యమని ప్రవంజన్ అన్నారు. అలాంటి అవకాశాలే వారిని మరింత పరిణతి చెందిన నాయకులుగా తీర్చిదిద్దుతాయని చెప్పారు. భవిష్యత్‌లో వైభవ్ భారత జట్టుకు కెప్టెన్‌గా ఎదగాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. ఆ ఆలోచనతోనే అతడికి దులీప్ ట్రోఫీలో వైస్ కెప్టెన్సీ అప్పగించినట్లు వెల్లడించారు.



# పదవీ విరమణ పొందిన అటెండర్ రామిల్లి భూమన్నకు ఘన సన్మానం

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**



డొంకేశ్వర్, డొంకేశ్వర్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో సబార్డినేట్ (అటెండర్) గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన రామిల్లి భూమన్న గురువారం ఘనంగా సన్నానం చేసి ఆత్మీయ వీడ్యోలు పలికారు. ఈ సందర్భంగా డొంకేశ్యర్ తహసీల్దార్ జి. ప్రపాద్ మాట్లాడుతూ, భూమన్న తన ఉద్యోగ జీతితమంతా క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో విధులు నిర్వహించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం పదవీ విరమణ పొందిన అటెండర్ రామిల్లి భూమన్నకు ఘన సన్మానం ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నవీపేట్ తహసీల్లార్ వెంకటరమణ, విశ్వకర్ష తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ్ మహిపాల్ చారి. డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు గణేష్ గౌడ్, ఆర్ నితీష్ రెడ్డి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొని భూమన్న శాలువాతో సన్నానించి, జ్ఞాపికను అండజేసి శుభాకాంక్షలు తెలిపారు.


# చెరువును కాపాడండి మహాప్రభో


**మద్దెలకుంట చెరువు రక్షణకు మత్స్యకారుల ఆందోళన..**
**అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు**





**మన దునియా,వరంగల్:జులై 30**





ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సర్వే నంబర్ 61, వరంగల్ దేశాయిపేట--పైడిపల్లి ప్రధాన రహదారిపై ఉన్న మద్దెలకుంట చెరువు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని మత్స్యకారుల సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 9 ఎకరాల 17 గుంటల విస్తీర్ణంలో ఉన్న మద్దెలకుంట చెరువును రక్షించాలని కోరుతూ గత మూడు నెలలుగా వరంగల్ తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఇరిగేషన్ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వెంచర్లకు కొందరు అధికారుల అండదండలు ఉండటంతో చెరువు ఆక్రమణకు గురవుతూ క్రమంగా కనుమరుగవుతోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువును పరిరక్షించి ఆక్రమణలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్థానిక అధికారులు స్పందించకపోతే, చెరువు రక్షణ కోసం త్వరలోనే ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి వినతిపత్రం సమర్పించనున్నట్లు మత్స్యకారుల సంఘం నాయకులు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి చెరువును పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

# కామన్వెల్త్‌లో నీరజ్ దూకుడు.. రోహిత్, యశ్‌వీర్‌తో కలిసి ఫైనల్‌కు

గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు జావెలిన్ త్రో విభాగంలో శుభారంభం లభించింది. ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రాతో పాటు రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్ ముగ్గురూ పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించారు. బలమైన గాలుల కారణంగా అథ్లెట్లకు త్రో విసరడం కష్టంగా మారినా, అత్యుత్తమ ప్రదర్శన చేసిన 12 మంది ఫైనల్‌కు చేరుకున్నారు. శుక్రవారం జరిగే ఫైనల్లో ఈ ముగ్గురు భారత అథ్లెట్లు పతకాల కోసం పోటీ పడనున్నారు. ఈ అర్హత పోటీలో ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ దూరమైన 84 మీటర్లను ఏ అథ్లెట్ అందుకోలేకపోయాడు. నీరజ్ చోప్రా తన రెండో ప్రయత్నంలో 79.61 మీటర్లు విసిరి ఐదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాడు. అప్పటికే అర్హత ఖరారవడంతో చివరి ప్రయత్నాన్ని ఉపయోగించుకోలేదు. రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు విసిరి తొమ్మిదో స్థానంలో నిలిచాడు. యశ్‌వీర్ సింగ్ 78.36 మీటర్లుతో పదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. గతేడాది సెప్టెంబర్ నుంచి నీరజ్ చోప్రాను నడుము కింది భాగం గాయం వేధిస్తోంది. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ముందు ఈ గాయం కావడంతో అతను ఆశించిన స్థాయిలో రాణించలేక ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గాయం కారణంగా ఈ ఏడాది సీజన్‌ను కూడా ఆలస్యంగా ప్రారంభించాడు. జూన్‌లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో ఒక్కసారి మాత్రమే బరిలోకి దిగి 85.69 మీటర్లు విసిరి నాలుగో స్థానంలో నిలిచాడు. అర్హత పోటీలో శ్రీలంక అథ్లెట్ రుమేశ్ పతిరాజే 82.84 మీటర్లు విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో అతని పేరిట ప్రపంచంలోనే అత్యుత్తమ త్రో 92.62 మీటర్లు ఉంది. గ్రెనడాకు చెందిన రెండుసార్ల ప్రపంచ ఛాంపియన్ అండర్సన్ పీటర్స్ 81.29 మీటర్లతో రెండో స్థానంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా అథ్లెట్ డౌ స్మిట్ 80.64 మీటర్లతో మూడో స్థానం దక్కించుకున్నాడు. ఇంగ్లండ్‌కు చెందిన బెన్ ఈస్ట్ నాలుగో స్థానంలో నిలవగా, ఆస్ట్రేలియా అథ్లెట్ కామెరాన్ మెక్‌ఎంటైర్ ఆరో స్థానంలో నిలిచాడు. ఒలింపిక్ ఛాంపియన్, పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శనగా 78.63 మీటర్లు విసిరి ఏడో స్థానంతో ఫైనల్‌కు చేరాడు. దీంతో శుక్రవారం జరిగే ఫైనల్లో నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్ మధ్య మరో ఆసక్తికర పోరు చూసే అవకాశం ఏర్పడింది.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# 100 కోట్ల క్లబ్‌లో అఖిల్.. 'లెనిన్'తో కెరీర్ బిగ్గెస్ట్ హిట్!




100 కోట్ల క్లబ్‌లో చేరిన అఖిల్ అక్కినేని 'లెనిన్'

కెరీర్‌లోనే అతిపెద్ద హిట్‌గా నిలిచిన చిత్రం

విడుదలైన 4 రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ సాధించిన సినిమా

సోషల్ మీడియా ద్వారా ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపిన అఖిల్

అక్కినేని యువ హీరో అఖిల్ తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. రెండో వారాంతంలోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను దాటి, అఖిల్ కెరీర్‌లో తొలి 100 కోట్ల చిత్రంగా రికార్డు సృష్టించింది. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఈ భారీ విజయంతో అఖిల్ ఆనందంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా అఖిల్ సోషల్ మీడియా వేదికగా ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. రూ.100 కోట్ల రికార్డు పోస్టర్‌ను పంచుకుంటూ, "నమ్మిన, మద్దతిచ్చిన, ఆదరించిన ప్రతి ఒక్కరికీ.. ఈ విజయం మీకోసం. ఎంతో కృతజ్ఞతతో తదుపరి సినిమాకు సిద్ధమవుతున్నాను. త్వరలోనే థియేటర్లలో కలుద్దాం" అని తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. విడుదలైన మొదటి రోజు నుంచే 'లెనిన్' పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్లింది. 'లెనిన్' చిత్రం ఆర్థికంగా కూడా భారీ విజయాన్ని నమోదు చేసింది. సుమారు రూ.55 కోట్ల బడ్జెట్‌తో నాగార్జున అక్కినేని, నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించారు. అఖిల్ స్టార్‌డమ్‌ను బట్టి థియేట్రికల్ బిజినెస్ రూ.22 కోట్లుగా జరగగా, బ్రేక్ ఈవెన్ టార్గెట్ రూ.44 కోట్లుగా ఉంది. అయితే, అంచనాలను మించిపోయిన ఈ చిత్రం కేవలం 3-4 రోజుల్లోనే అన్ని మార్కెట్లలో బ్రేక్ ఈవెన్ సాధించి లాభాల బాట పట్టింది. ఈ అద్భుతమైన విజయం అఖిల్ కెరీర్‌కు ఎంతో అవసరమైన భారీ బూస్ట్‌ను ఇచ్చిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## వైఎస్ జగన్ రాజకీయాల్లోకి.. నేను సినిమాల్లోకి వెళతామని ముందే ఊహించాం: హీరో సుమంత్

సీఎం అయ్యాక జగన్‌ను కలవలేదని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కలిశానని వెల్లడి

హీరో సుమంత్ తన కొత్త చిత్రం 'న్యూటన్స్ థర్డ్ లా' ప్రమోషన్లలో భాగంగా, ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తో తనకున్న అనుబంధం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తామిద్దరూ 'హైదరాబాద్ పబ్లిక్ స్కూల్' (హెచ్‌పీఎస్)లో కలిసి చదువుకున్నామని, ఆ రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. జగన్‌లో చిన్న వయసు నుంచే నాయకత్వ లక్షణాలు స్పష్టంగా కనిపించేవని సుమంత్ వెల్లడించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ.. "జగన్ నాకు స్కూల్లో రెండేళ్లు సీనియర్. అయినా మా ఇద్దరి మధ్య మంచి స్నేహం ఉండేది. మా బాండింగ్ చాలా బలంగా ఉండేది. తరచూ కలిసి సినిమాలకు, రెస్టారెంట్లకు వెళ్లేవాళ్లం. స్కూల్ కార్యక్రమాల్లో కూడా కలిసి పాల్గొనేవాళ్లం" అని తెలిపారు. జగన్ అప్పట్లో తమ స్కూల్ హౌస్ కెప్టెన్‌గా ఉండేవారని, ఆయనలో నాయకత్వ లక్షణాలు అప్పటి నుంచే కనిపించేవని చెప్పారు. "జగన్ చాలా ప్రశాంతంగా, అదే సమయంలో చాలా ధైర్యంగా వ్యవహరించేవారు. అతను కచ్చితంగా రాజకీయాల్లోకి వెళ్తాడని, నేను సినిమాల్లోకి వస్తానని మా స్నేహితులందరూ అప్పుడే ఊహించేవారు. చివరకు మేమిద్దరం అనుకున్న రంగాల్లోనే స్థిరపడ్డాం" అని సుమంత్ వివరించారు. అయితే, తనకు రాజకీయాల్లోకి వచ్చే ఆసక్తి ఏమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. "రాజకీయాలు చాలా బాధ్యతాయుతమైనవి. ఆ రంగంలో రాణించాలంటే సహజంగానే ఆసక్తి, అంకితభావం అవసరం. నాకు ఆ ఆసక్తి లేదు. రాజకీయాల్లో నాకు చాలామంది మిత్రులు ఉన్నారు, వారిని గౌరవిస్తాను. కానీ నేను మాత్రం ఆ రంగానికి సరిపోను" అని సుమంత్ స్పష్టం చేశారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కలిసే అవకాశం రాలేదని, కానీ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఒకసారి కలిశానని సుమంత్ తెలిపారు. స్కూల్ పూర్తయ్యాక కెరీర్ల పరంగా ఇద్దరి దారులు వేరు కావడంతో తరచూ కలుసుకోవడం తగ్గిపోయిందని పేర్కొన్నారు. తమ పాఠశాల హెచ్‌పీఎస్ నుంచి సినీ పరిశ్రమకు తన మామ నాగార్జున, తాను, తన జూనియర్ అయిన రానా దగ్గుబాటి, దర్శకుడు నాగ్ అశ్విన్‌తో పాటు మరెందరో వచ్చారని సుమంత్ గుర్తు చేసుకున్నారు.



# 'యానిమల్'లాంటి సినిమాలు ఇక చేయొద్దు.. రణ్‌బీర్‌కు 'మహాభారత్ కృష్ణుడి' విజ్ఞప్తి

నవంబర్ 8న విడుదల కానున్న 'రామాయణ'

బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్‌కు ప్రముఖ నటుడు నితీశ్ భరద్వాజ్ కీలక సూచన చేశారు. 'యానిమల్' వంటి సినిమాల్లో ఇకపై నటించొద్దని, తన వాణిని కలుషితం చేసుకోవద్దని కోరారు. త్వరలో విడుదల కానున్న 'రామాయణ' సినిమా ట్రైలర్‌పై స్పందిస్తూ సోషల్ మీడియాలో ఈ వ్యాఖ్యలు చేశారు. భారతీయ సంస్కృతి, విలువలను కాపాడే బాధ్యత ఇప్పుడు రణ్‌బీర్‌పై ఉందని పేర్కొన్నారు. బీఆర్ చోప్రా రూపొందించిన టెలివిజన్ ధారావాహిక 'మహాభారత్'లో శ్రీకృష్ణుడి పాత్రతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నితీశ్ భరద్వాజ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో 'రామాయణ' పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ చిత్ర బృందంపై ప్రశంసల వర్షం కురిపించారు. దర్శకుడు నితీశ్ తివారీ ప్రపంచ సినిమాకు భారత్ అందించే మరో గొప్ప బహుమతిగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు. ఈ చిత్రం ఉత్తమ విదేశీ చిత్రంగా ఆస్కార్ అవార్డు గెలిచే స్థాయి కలిగి ఉందని వ్యాఖ్యానించారు. వీఎఫ్ఎక్స్, ఏఐ సాయంతో అద్భుతమైన ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించారని నితీశ్ కొనియాడారు. నిర్మాణ రూపకల్పన, సినిమాటోగ్రఫీకి ఎన్నో అవార్డులు వస్తాయని చెప్పారు. హాలీవుడ్ సంగీత దిగ్గజం హాన్స్ జిమ్మర్ భారతీయ సినిమాతో కలిసి పనిచేయడం గర్వకారణమని పేర్కొన్నారు. రణ్‌బీర్ కపూర్, రణ్‌వీర్ సింగ్ ఇద్దరూ భారతీయ సినీ రంగంలోని అగ్ర నటులుగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు. యశ్‌కు ప్రపంచ సినీ రంగంలోకి స్వాగతం పలికారు. రణ్‌బీర్‌ను ఉద్దేశిస్తూ నితీశ్ ప్రత్యేక సందేశం ఇచ్చారు. నటుడిగా ఆయనంటే ఎప్పటి నుంచో ఇష్టమని చెప్పారు. ఇకపై భారతీయ వారసత్వం, సంస్కృతి, విలువలను నిలబెట్టే బాధ్యత ఆయనపై ఉందన్నారు. ఎంత పెద్ద పారితోషికం ఇచ్చినా 'యానిమల్' లాంటి సినిమాలు చేయొద్దని కోరారు. భారతదేశంలో నటనకు అవకాశమిచ్చే గొప్ప కథలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే సీత పాత్రలో సాయిపల్లవిని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమాలో తులసీదాస్ చౌపాయిల స్వరాలు కూడా వినిపిస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' భారీ వసూళ్లు సాధించినా, మహిళలను చూపిన తీరు, అధిక హింస, రక్తపాతం వంటి అంశాలపై తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. మరోవైపు నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న 'రామాయణ' ట్రైలర్ గురువారం విడుదలైంది. భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందిన ఈ చిత్రం 2026 నవంబర్ 8న ప్రేక్షకుల ముందుకు రానుంది.





# బాలీవుడ్ నటికి సైబర్ షాక్... రూ. 2.43 లక్షలు కాజేసిన మోసగాళ్లు

**సైబర్ మోసానికి గురైన నటి కీర్తి కుల్హారి**

**ఆమె క్రెడిట్ కార్డు నుంచి రూ. 2.43 లక్షలు అపహరణ**

**గుర్తుతెలియని వ్యక్తులపై ముంబైలో కేసు నమోదు**

**క్షణాల వ్యవధిలో నాలుగు అనధికారిక లావాదేవీలు**

**కేసు దర్యాప్తు చేస్తున్న ముంబై సైబర్ సెల్ పోలీసులు**

ప్రముఖ బాలీవుడ్ నటి, నిర్మాత కీర్తి కుల్హారి సైబర్ మోసానికి గురయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆమె క్రెడిట్ కార్డు నుంచి అనధికారికంగా రూ. 2,43,852 మేర లావాదేవీలు జరపడంతో ఆమె ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అంబోలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, నగర సైబర్ సెల్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే, జూలై 24 రాత్రి ఈ సైబర్ మోసం చోటుచేసుకుంది. అంధేరి వెస్ట్‌లోని ఓ మల్టీప్లెక్స్ వద్ద ఉన్న సమయంలో కీర్తి మొబైల్ ఫోన్‌కు బ్యాంకు నుంచి ఒక సందేశం వచ్చింది. ఆమె క్రెడిట్ కార్డును ఉపయోగించి ఏరోమెక్సికో ఎయిర్‌లైన్స్‌లో 2,525 యూఎస్ డాలర్ల విలువైన లావాదేవీ జరిగినట్లు అందులో ఉంది. దీంతో అప్రమత్తమైన ఆమె వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌ను సంప్రదించారు. బ్యాంకు అధికారులు ఆమె ఖాతాను పరిశీలించగా, నిమిషాల వ్యవధిలోనే మొత్తం నాలుగు అనధికారిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. వాటి మొత్తం విలువ రూ. 2.43 లక్షలకు పైగా ఉండటంతో, తదుపరి నష్టం జరగకుండా బ్యాంకు తక్షణమే ఆ కార్డును బ్లాక్ చేసింది. తాను తన క్రెడిట్ కార్డు పాస్‌వర్డ్, పిన్ లేదా ఇతర రహస్య వివరాలను ఎవరితోనూ పంచుకోలేదని కీర్తి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో స్పష్టం చేశారు. మాల్వేర్ లేదా స్పైవేర్ ద్వారా ఆమె ఫోన్ లేదా కార్డు వివరాలను సైబర్ నేరగాళ్లు తస్కరించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. 'పింక్', 'యూరి: ది సర్జికల్ స్ట్రైక్', 'మిషన్ మంగళ్' వంటి చిత్రాలతో పాటు 'ఫోర్ మోర్ షాట్స్ ప్లీజ్!', 'స్కూప్' వంటి వెబ్ సిరీస్‌లతో కీర్తి కుల్హారి ప్రేక్షకులకు సుపరిచితులు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com